ఓ మహాయశముగల రాజపుత్రా, తన భార్య అహల్యా సహితుడై పూర్వం గౌతముడు అనేక వర్షాలు ఇక్కడ తపస్సు చేశాడు.

**తస్య అంతరం విదిత్వా తు సహస్రాక్షః శచీ పతిః।**
**ముని వేష ధరో భూత్వా అహల్యాం ఇదం అబ్రవీత్**

।౧-౧౧-౧౧।

గౌతముడు ఆశ్రమంలో లేని వేళ తెలుసుకొని, సహస్రాక్షుడైన శచీపతి మునివేషం ధరించి అహల్య చెంతకు చేరి ఇలా అన్నాడు.

**ఋతు కాలం ప్రతీక్షంతే న అర్థినః సుసమాహితే।**
**సంగమం తు అహం ఇచ్ఛామి త్వయా సహ సుమధ్యమే**

।౧-౪౮-౧౮।

చక్కని అంగాలు గలదానా, అర్థించేవారు ఋతుకాలం కోసం ఎదురుచూడరు. నీతో సంగమాన్ని కోరుతున్నాను, ఓ చక్కని నడుము గలదానా!

**ముని వేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన।**
**మతిం చకార దుర్మేధా దేవ రాజ కుతూహలాత్**

।౧-౪౮-౨౦।

రఘునందనా, మునివేషంలో ఉన్నవాడు సహస్రాక్షుడని తెలిసినా దుర్మేధస్సుతో దేవరాజు కుతూహలాన్ని తీర్చాలని నిర్ణయించుకుంది.



**అథ అబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థేన అంత రాత్మనా।**
**కృతార్థా అస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రం ఇతః ప్రభో**

।౧-౪౮-౨౧।

**ఆత్మానం మాం చ దేవేశ సర్వదా రక్ష గౌతమాత్।**

అప్పుడు సురశ్రేష్ఠుని కోర్కె దీర్చి ఇలా అన్నది: "కృతార్థురాలను అయ్యాను, ఓ సురశ్రేష్ఠా, ఇప్పుడు శీఘ్రంగా వెళ్లు. ఓ దేవేశా, నిన్ను, నన్ను గౌతముని నుండి రక్షించుకోవడానికి."

**ఇంద్రః తు ప్రహసన్ వాక్యం అహల్యాం ఇదం అబ్రవీత్**

।౧-౪౮-౨౨।

**సుశ్రోణి పరితుష్టో అస్మి గమిష్యామి యథా ఆగతం ।**

ఇంద్రుడు నవ్వుతూ అహల్యతో ఇలా అన్నాడు: "ఓ సుశ్రోణి, నేనూ పరితుష్టుడనయ్యాను. ఎలా వచ్చానో, అలా వెళ్తాను."

**ఏవం సంగమ్య తు తయా నిశ్చక్రామ ఉటజాత్ తతః**

।౧-౪౮-౨౩।

**స సంభ్రమాత్ త్వరన్ రామ శంకితో గౌతమం ప్రతి।**

ఓ రామా, అలా సంగమించి ఇంద్రుడు గౌతముడు వస్తాడేమోనన్న శంకతో త్వరగా నిష్క్ర మించుచుండగా,

**గౌతమం స దదర్శ అథ ప్రవిశంతం మహామునిం**

।౧-౪౮-౨౪।

**దేవ దానవ దుర్ధర్షం తపో బల సమన్వితం।**
**తీర్థ ఉదక పరిక్లిన్నం దీప్యమానం ఇవ అనలం**

।౧-౪౮-౨౫।

**గృహీత సమిధం తత్ర స కుశం ముని పుంగవం।**

దేవదానవులకు దుర్ధర్షుడు, తపోబల సమన్వితుడు, నదీస్నానం చేసి తడిగా ఉన్నా యజ్ఞాగ్నివలే వెలిగిపోతున్నవాడు అయిన గౌతముడిని చూశాడు, సమిధలు, దర్భకర్రలు ఆ మునిపుంగవుని చేతిలో ఉండగా

**దృష్ట్వా సుర పతిః త్రస్తో విషణ్ణ వదనో అభవత్**

।౧-౪౮-౨౬।

**అథ దృష్ట్వా సహస్రాక్షం ముని వేష ధరం మునిః।**
**దుర్వృత్తం వృత్త సంపన్నో రోషాత్ వచనం అబ్రవీత్**

।౧-౪౮-౩౧।

చూడగానే సురపతి భయంతో విషణ్ణ వదనుడయ్యాడు. అప్పుడు మునివేషంలో దుర్వృత్తిలో ఉన్న సహస్రాక్షుణ్ణి చూసి వృత్త సంపన్నుడైన ఆ ముని రోష వచనాలు పలికాడు:

**మమ రూపం సమాస్థాయ కృతవాన్ అసి దుర్మతే।**
**అకర్తవ్యం ఇదం యస్మాత్ విఫలః త్వం భవిష్యతి**

।౧-౪౮-౨౮।

"ఓ దుర్మతి, నా రూపం స్వీకరించి చెయ్యకూడని కార్యాన్ని నిర్వహించావు. ఇక నీవు వృషణాలు లేని వాడవగుగాక!"

**గౌతమేన ఏవం ఉక్తస్య స రోషేణ మహాత్మనా।**
**పేతతుః వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్ క్షణాత్**

।౧-౪౮-౨౯।

మహాత్ముడైన గౌతముడు రోషంతో ఆ విధంగా పలకగానే ఇంద్రుని వృషణాలు ఆ క్షణమే భూమిమీద రాలిపడ్డాయి.

**తథా శప్త్వా చ వై శక్రం భార్యాం అపి చ శప్తవాన్।**
**ఇహ వర్ష సహస్రాణి బహూని నివషిస్యసి**

।౧-౪౮-౩౦।

**వాయు భక్షా నిరాహారా తప్యంతీ భస్మ శాయినీ।**
**అదృశ్యా సర్వ భూతానాం ఆశ్రమే అస్మిన్ వషిస్యసి**

।౧-౪౮-౩౧।

ఇంద్రుని అలా శపించి, పిదప, తన భార్యను కూడా "నీవు వేల సంవత్సరాలు వాయువు భక్షణ చేస్తూ, నిరాహారివై, ధూళి, భస్మాలపై శయనిస్తూ, సర్వభూతాలకు అదృశ్యంగా ఈ ఆశ్రమంలో పడి ఉండుగాక" అని శపించాడు.

**యదా తు ఏతత్ వనం ఘోరం రామో దశరథ ఆత్మజః।**
**ఆగమిష్యతి దుర్ధర్షః తదా పూతా భవిష్యసి**

।౧-౪౮-౩౨।

ఎప్పుడైతే ఈ ఘోరవనానికి దుర్ధర్షుడైన దశరథాత్మజుడు, రాముడు వస్తాడో అప్పుడు పవిత్రురాల వౌతావు.

**తస్య ఆతిథ్యేన దుర్వృత్తే లోభ మోహ వివర్జితా।**
**మత్ సకాశే ముదా యుక్తా స్వం వపుః ధారయిష్యసి**

।౧-౪౮-౩౩।

"ఓ దుర్వృత్తి గావించినదానా, అతనికి ఇచ్చే ఆతిథ్యంతో నీ లోభ మోహాలు తొలగిపోయి నీవు స్వయం రూపం ధరించి నావద్దకు చేరుకుంటావు."

**ఏవం ఉక్త్వా మహాతేజా గౌతమో దుష్ట చారిణీం।**
**ఇమం ఆశ్రమం ఉత్సృజ్య సిద్ధ చారణ సేవితే।**
**హిమవత్ శిఖరే రమ్యే తపః తేపే మహాతపాః**

।౧-౪౮-౩౪।

*దుష్టచారిణిని అయిన అహల్యతో అలా అని మహాతేజుడైన గౌతముడు ఈ ఆశ్రమాన్ని వదిలివేసి సిద్ధచారణులు సేవించుచుండగా రమ్యమైన హిమవత్ శిఖరాల వద్ద తపస్సు కొనసాగించాడు.*

ఇక కంబరామాయణంలో అహల్యాపటలము ఇలా సాగుతుంది. (కంబరామాయణంలో అహల్యా వృత్తాంతానికి తెలుగుసేత పూతలపట్టు శ్రీరాములు రెడ్డి చేసిన తెలుగు అనువాదం నుండి తీసుకున్నాను సు.కొ.)

**హర్షమొందుచు విదేహారాములఁ జూచి, వెలలి**
**ప్రాకార సంవేష్టితమగు**
**మిథిలా నగరికొక్క మేటి యలంకార మైపొడవైన**
**ధ్వజాలి వెలయు**
**బయటి ప్రహరికి వెల్పల వచ్చి నిల్వగా ర్శ్లాఘ్యోచితము**
**పతివ్రత గుణంబు**
**పదరి పాడోనరించి భర్తృ శాపంబున రాయియై**
**పడియున్న రామ యపుడు**

**రామపదధూలి సోక పూర్వంబు మనసు**
**నలము నజ్ఞాన మత్తత దొలఁగ నెఱుక**
**తేజ రూపాంతరం బొంది దేవునెదుటఁ**
**బొలుచు జని పోల్కఁ దొలిరూపు దొలఁక నిలిచె**

**క్రిందికి గంగఁ దెచ్చిన భగీరథు వంశమునం**
**జనించు నో**
**సుందర! తృప్తిమై మెఱుపు చొప్పునఁ గ్రేవ**
**నొదింగి నిల్చు నీ**
**చెందొవకంటి యిష్టపడి చెడ్డ యొనర్చిన**
**పాకవైరికిన్**
**గ్రందుగ వేయి కన్నులిడు ఘౌతమ పత్ని**
**యహల్య నాఁ జనున్**
**కెంజడ లుల్లసిల్లు ముని కేసరి యట్టులు పల్క**
**విన్న శ్రీ**
**కంజనివాసినీపతి వికస్వర పద్మదళాక్షుడిట్లనుం**
**నెంజలి యిట్టులౌట తన నెక్కొను పూర్వ**
**కృతాపరాధమా?**
**యంజక యప్పుడొప్పిన స్వయంకృతమా?**
**యెఱుఁగంగఁ బల్కవే?**
**అనవిని భూరి విజ్ఞుడగు నమ్ముని యిట్లను**
**సద్గుణాలయ**
**విను మును వజ్రియూర్ధ్వగత వీర్యుడు గౌతముఁ**
**డింట లేని వే**
**ళను హరిణాక్షి చంద్రముఖి లాలిత లక్షణ**
**లక్షితాంగి యా**
**వనిత యహల్యతోఁ గలయ వాంఛ వహించె**
**మనంబు లోపలన్**
**తొలఁగ కహల్య చూపులను తూపులు మార**
**నిశాత సాయకం**
**బులు మది గాఁడ విజ్ఞతయు బోవ మదిం గల**
**యూరటంబుచే**
**నలయుచునున్న యింద్రుఁడొక యప్పుడు**
**సాహసవృత్తి నాగృహ**
**స్థులకు వియోగముంగొలిపి చొచ్చెను**
**గౌతమవేషియై యటన్**

ఇరువురు చేరి కామమను నింపగు నాసవమాను
చుండు నా
తరి నితఁ డింద్రుఁడంచెఱిగి ధర్మమధర్మము
మానసంబునం
తరయక సమ్మతించి చెలి యంగజ
సౌఖ్యములందు దేలె న
త్తరుణమునన్ మునీశ్వరుఁడు తత్తఱ వచ్చె
గృహంబు చేరఁగన్

విలుపని లే కమోఘముగఁ బెంపఱఁ దిట్ట
వరంబులిచ్చి వే
ల్పుల యెకినీనిఁ జేయఁగల ప్రోడఁడు గౌతమ
మౌని డాయ రాఁ
దలఁగక లోక మొల్లెడ సదా చెడకుండెడు
నిందఁగొన్న య
వ్వెలఁది వడంకి నిల్చె బల భేది చనందోడఁగెన్
బిడాలమై

అనుపమ నీలిశాలియగు నమ్మని కన్నుల
నిప్పులుర్లఁగాఁ
గని కథ యంతయుం దెలిసి కార్ముకవీర!
భవత్కరచ్యుతో
గ్ర నిశిత కాండముం జెనయు ఖండిత
వాక్కులతో శపించె వ
జ్రిని పది నూర్ల యోనుల శరీరము నొందుము
యంచు నత్తఱిన్

క్షణములో శాపఫలమొంది జంభభేది
యెల్లిదంబగు లజ్జతో నేగుపిదపఁ
జెలువఁ గని వెలవెలఁది చేష్టలను పొంది
నట్టి నీవును శిలవగుమని శపించె

మౌనికాళ్లం బడి మడఁతి యో మునినాథ
మన్నిపు మీ తప్పు నన్ను గావు
పిన్నల తప్పులఁ బెద్దలు సైఁచుట తగునని
నీతివేత్తలు వచింత్రు
రని వేఁడ జ్వాలల నార్చు రుద్రుని పోలెఁ గ్రుద్ధుడై
కను మునీంద్రుడు నంత
సతియెడ దయతో బ్రసన్నుఁడై వనమాలి
రాముని శ్రీపాద రజము సోఁక



నీ యథారూపమెందుదో నెలఁతయనియె
నింద్రుఁకొని నిలింపులు ముని యెడకు వచ్చి
వేఁడ నతని యోనుల మాన్చి వేయి కనుల
నిచ్చి పంపె నహల్య రాయిగను పడియె

ఈ రెండ కథనాల మధ్య తేడాలు కొన్ని: వాల్మీకి కథలో ఇంద్రుని విషయం అహల్యకు ముందుగానే తెలుసు. కంబ రామాయణంలో వచ్చింది భర్త కాదని అహల్య మధ్యలో గ్రహించినా, ఆ నిషిద్ధ సుఖాన్ని వదల లేకపోతుంది. అదికాక కంబ రామాయణంలో అహల్య భర్త పూర్తిగా జపతపాదులలో మునిగినట్లు మనకు ముందుగా సూచించడం కూడా కథకు సంక్లిష్టతను జోడిస్తుంది. తమిళకథలో ఇంద్రుడు పిల్లిరూపంలో పారిపోవడానికి ప్రయత్నిస్తాడు. జానపదంలో లోక ప్రియమైన ప్రసక్తి ఇది. కథాసరిత్సాగరంలో కూడా వుంది. గౌతముడు ఇంద్రునికి ఒళ్లంతా సహస్ర యోనులు కలగాలని శాపమిచ్చి, తరువాత దాన్ని సహస్రనయనాలుగా మారుస్తాడు; అహల్యను సుఖ స్పందనలేని రాయిలా మారుస్తాడు. వాల్మీకి కథలో కనిపించని ఈ వివరాలు, దక్షిణ భారతంలో జానపదుల కథల్లో, తమిళ శాసనాల్లోనూ, ఇతర దక్షిణ భారత భాషల రామాయణాల్లోనూ కనిపిస్తాయి. అంటే, వాల్మీకి కథను ఉపయోగించుకోవడమే కాక, కంబకవి తను నివసిస్తున్న ప్రాంతంలోని జానపద సంప్రదాయాలను తనలో కథలో గుప్పించాడన్నమాట. ఈ కథలు

ఇతర రామాయణాల్లో కనిపించడానికి కూడా కంబ రామాయణమే ఆధారం కావచ్చు.

కథాశిల్పం విషయంలో కూడా కంబ రామాయణంలో నాటకీయత ఎక్కువ. కంబ రామాయణంలో ముందుగా రాముని పాదధూళి తాకి నల్లరాయి అహల్యగా మారుతుంది. ఆ తరువాతే ఆమె కథ మనకు తెలుస్తుంది. నల్లరాయి, ఎత్తైన ప్రదేశంపై రాముని రాకకు ఎదురుచూస్తూ ఉండటమే అద్భుత దృశ్యావిష్కారానికి ప్రతీక. అహల్య శాపవిమోచనం, జడమైన రాయి రక్తమాంసాలున్న మనిషిగా మారడం, పరమాత్మ స్వరూపానికి భక్తిభావం చూపే ఆత్మ ప్రతిస్పందనలా అనిపిస్తుంది. అంతేకాక, కంబ రామాయణంలో అహల్య వృత్తాంతానికి అంతకు ముందే చెప్పిన తాటకి వృత్తాంతానికి కూడా సంబంధం చూపుతుంది. తాటక కథలో రాముడు పాపభంజనుడు. శత్రువులకు జడత్వాన్ని, మృతిని కూర్చేవాడు. అహల్య కథలో జడత్వానికి ప్రాణం పోసేవాడు; వరాల ధార కురిపించే ఘన నీలమేఘం. కంబని కథలో రాముడు అచ్చమైన తమిళ కథానాయకుడు. అరిభంజనుడు, భక్తప్రియరంజనుడు. అహల్య శాపవిమోచనం, లోకంలోని సకల జనులకు వారి పాపాలనుండి విముక్తి కలిగించడమే రాముని అవతార లక్షణంగా చూపిస్తుంది.

వాల్మీకి రామాయణంలోని రాముడు సంపూర్ణ మానవుడు. మానవరూపంలో కష్టసుఖాలనుభవిస్తూ, ఎలా ధర్మబద్ధమైన జీవితం గడపాలో రాముడి ద్వారా లోకానికి చెప్పబడింది. బాలకాండలోనూ, రావణుని సంహరించే సమయంలో రాముడిని పరమాత్మ స్వరూపంగా, అవతారపురుషుడిగా వర్ణించే సంఘటనలు, తరువాత జత చేసిన ప్రక్షిప్తాలని పండితుల వాదన. కంబ రామాయణంలో మాత్రం రాముడు కథలో ఆసాంతం భగవత్ స్వరూపమే. కాబట్టి అహల్య కథ వంటి సంఘటనలలో భక్తి, ఆరాధనా ప్రకటనలు గాఢంగా కనిపిస్తాయి. కంబ రామాయణం పన్నెండవ శతాబ్దంలో భక్తి ఉద్యమ ప్రభావంలో రాసినది. కంబ కథనంలో రాముడు చెడుని తొలగించి, మంచిని సంరక్షించే క్రమంలో అహల్యతో మొదలుకొని, రావణుడి వధించే వరకూ తన ధర్మాన్ని నిర్వర్తించినవాడు. వైష్ణవ భక్తి సంప్రదాయపు నమ్మాళ్వార్ ప్రతీకలు ఇందులో



కనపడుతాయి. నమ్మాళ్వార్ రాసిన ఈ పాశురాన్ని చూడండి:

**కఱ్పార్ ఇరామ పిరానై అల్లాల్ మట్టుం కఱ్పరో?**
**పుఱ్పా ముదలా పుల్లెఱుంబాది ఒన్ఱ్ ఇండ్రియే**
**నఱ్పాల్ అయోద్దియిల్ వాళుం చరాచరం**
**ముట్రవుం**
**నఱ్పాలుక్కు ఉయ్త్తనన్ నాన్ముగనార్ పెట్ట**
**నాట్టుళే. నమ్మాళ్వార్ 7.5.1**

**ఎఱిగి రామ ప్రభువును వేరొకరినెఱుగనేల?**
**గడ్డి మొదలు పాకే చీమవరకు ఎవరినొల్లక**
**శుభ అయోధ్యలో వసించు చరాచరమెల్లరికి**
**శుభమును కూర్చె బ్రహ్మసృష్టికిలలోన్**

నమ్మాళ్వారు చూపిన ఇటువంటి భక్తిభావనలే కంబ రామాయణపు కావ్యమంతటా మనకు ప్రత్యక్ష మవుతాయి.

పైన చూపిన విధంగా అహల్య కథ ఒకటే అయినా, భిన్నమైన కథనాలతో, రంగులతో ఎలా వేర్వేరుగా అల్లబడిందో, అలాగే వివిధ రామాయణాల్లో తరువాతి కవులు పూర్వకవుల కథకు తమవైన మెరుగులు దిద్దడం ద్వారా తమ సృజనాత్మకతను చాటుకోవడం కనిపిస్తుంది. ఒక రకంగా తరువాతి రామాయణాల కథనాలు, పూర్వ రామాయణ కథనాలకు అధి-చిత్రీకరణలు. ఉదాహరణకు, 16వ శతాబ్దానికి చెందిన ఆధ్యాత్మ రామాయణం వంటి కథల్లో రాముడు వనవాసం వెళ్లేటప్పుడు సీత తనతో రాకూడదంటాడు. సీత రామునితో వాదిస్తుంది. ముందుగా మామూలు జవాబులే చెబుతుంది: ధర్మపత్నిగా అతని కష్టసుఖాలలో పాలు పంచుకోవాలి. అతడు వనవాసం చేస్తే తాను కూడా వనవాసిగా మారాలని చెబుతుంది. రాముడు కూడదంటాడు. సీత అప్పుడు రోషంతో, "ఇంతవరకూ లెక్కలేనన్ని రామాయణాలు వచ్చాయి. ఏ ఒక్క రామాయణంలోనైనా రామునితో అడవికి వెళ్లని సీతను ఎక్కడైనా చూశామా?'' అని ప్రశ్నిస్తుంది. దాంతో రాముడు ఒప్పుకుంటాడు; సీత రామునితో అడవికి వెళ్తుంది. ఇటువంటి కథనం వేరే రామాయణాల్లో కూడా కనిపిస్తుంది.

కంబ రామాయణం కూడా తరువాత వచ్చిన రామాయణాలపై తన ప్రభావాన్ని చూపించింది. తెలుగుదేశంలో వచ్చిన తెలుగు రామాయణాలలో, మలయాళ దేశపు దేవాలయాల్లో వేసే రామాయణ రూపకాల్లోను ఈ ప్రభావం మనం చూడవచ్చు. ఆగ్నేయాసియాలో వచ్చిన రామాయణాలపై కూడా కంబ రామాయణ ప్రభావం కనిపిస్తుంది. కంబ రామాయణమే థాయి భాషలో వచ్చిన రామకిఎన్ ఆధారమని పరిశోధకులు నిరూపించారు. ఉదాహరణకు, థాయి భాషలో పాత్రల పేర్లకు సంస్కృతపు పేర్లు కాక తమిళ రామాయణంలో వాడిన కొన్ని పేర్లు వాడడం: థాయి రామాయణంలో ఋష్యశృంగుడి పేరు కలైక్కోటు. తులసీదాసు రాసిన రామచరితమానస్ లోనూ, మలేషియన్ భాషలోని 'హికయత్ సేరి రామ్' అన్న కథలోనూ కంబ రామాయణ ప్రభావాలు కనిపిస్తాయి (సింగరవేలు, 1968).

భిన్న మార్గాల ద్వారా రామాయణం ఉత్తరం దిశగా పంజాబ్, కాశ్మీర్‌ల గుండా చైనా, టిబెట్ మరియు తూర్పు తుర్కిస్తాన్‌కీ, సముద్రం మార్గం ద్వారా దక్షిణ దిశలో గుజరాత్, దక్షిణ భారతం గుండా జావా, సుమత్రా మరియు మలయాదేశాలకి, భూమార్గం ద్వారా తూర్పు దిశలో బెంగాల్ గుండా బర్మా, థాయిలెండ్ మరియు లావోస్‌కి వెళ్లాయి (దేశాయి 1970, 5).

ఈమాట సౌజన్యంతో

(సశేషం)



*సురేష్ కొలిచాల ఈమాట అంతర్జాల పత్రిక వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. భాషా శాస్త్రం, చరిత్రకు సంబంధించి అనేక వ్యాసాలు రాశారు. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నివాసం అట్లాంటాలోని జార్జియా.*




# మోటర్ బైక్ పై
# యూరోలాగ్

శ్రీ బసాబత్తిన

మా ప్రయాణంలో ఈరోజు చాలా కీలకమైన రోజు. ఎందుకంటే ఈరోజు మేము స్టెల్వియో పాస్ వెళుతున్నాం. స్టెల్వియో పాస్ ఉత్తర ఇటలీలో మొదలయ్యి పక్కనే ఉన్న సిట్జర్లాండ్ వరకు విస్తరించింది. సముద్ర మట్టానికి తొమ్మిదివేల అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ కొండ ఎక్కాలంటే ఇంచుమించు నలభై ఎనిమిది తల పిన్ను మలుపులు తిరగాలి. అందుకే స్టెల్వియో పాసులో ప్రయాణించాలని మోటారుసైకిల్ బైకర్లు ఉవ్విళ్లూరుతూ ఉంటారు. అంతే కాకుండా ఎత్తైన ఈ కొండలపై తెల్లగా మంచు కప్పబడి చాలా అందంగా ఉంటుంది. అద్భుతమైన ప్రకృతిని చూసి పరవశిస్తూ మనల్ని మనం మర్చిపోయేలా చేస్తుంది ఈ ప్రయాణం. చలికాలంలో స్టెల్వియో పాస్ మూసి వేస్తారు. మళ్లీ జూన్ నెలలో తెరిచి సెప్టెంబరు వరకు అందరికీ అందుబాటులో ఉంటుంది. 1820 సంవత్సరంలో ఆస్ట్రియా దేశం ఈ రహదారిని నిర్మించడం మొదలుపెట్టింది. మొదటి ప్రపంచ యుద్ధంలో స్టెల్వియో పాస్ ప్రాంతం చాలా కీలకపాత్ర పోషించింది. 2008లో ఇటలీకి చెందిన మోటారుసైకిళ్లు తయారుచేసే సంస్థ మోటో గూచి తమ బండికి స్టెల్వియో అని పేరు పెట్టుకున్నారు.

ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో చివరి శనివారం లేకపోతే సెప్టెంబరు నెలలో మొదటి శనివారం స్టెల్వియో జాతీయ పార్కు స్టెల్వియో బైక్ రోజుని నిర్వహిస్తుంది. ఆరోజు కార్లు, మోటారుసైకిళ్లని రానివ్వకుండా సైకిళ్లు మాత్రమే రోడ్ మీద తిరుగుతాయి. ఆ రోజు ఇంచుమించు 12000 సైకిళ్లకి పైగా పాల్గొంటాయి.

యూరప్ ప్రయాణం అనుకున్నప్పటి నుండి నేను యూట్యూబులో స్టెల్వియో పాస్ వీడియోలు బాగా చూశాను. యూట్యూబ్ వీడియోల వలన ముందే స్టెల్వియో పాస్ మీద ఒక అవగాహన వచ్చింది. అలాగే అంతర్జాలంలో వారి ప్రయాణం అనుభవాలు కూడా తెలుసుకోగలిగాము. చివరకు మేము కూడా ఇక్కడ ప్రయాణించే రోజు వచ్చింది. ఆనందం, మరికొంత ఆందోళనతో కొంచెం భయం కూడా మొదలయింది. ఇంతకు ముందు కొలరాడో రాష్ట్రంలో మిలియన్ డాలర్ హైవేపై వెళ్లే ముందు కూడా ఇలాగే జరిగింది. ఒక్కసారి సవారీ ముగిసిన వెంటనే మన మీద మనకి ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా అంతకు ముందు ఏర్పడిన భయం కూడా కొట్టుకుపోతుంది.

ప్రయాణం ముందు అందరం తమ మోటారు సైకిళ్లను పరీక్షించుకున్నాం. మలుపుల్లో మోటారుసైకిల్ టైర్లలో సరైన గాలి ఉండాలి. తక్కువ గాలి ఉంటే రోడ్ పైనున్న పదునైన రాళ్లు, చీలలు గుచ్చుకుని

పంక్చర్ అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. టైరులో గాలి ఎక్కువ ఉంటే బండి అదురుతూ ఉంటుంది. సరైన గాలి లేకపోతే మలుపులో బండి అదుపు తప్పే అవకాశాలు కూడా లేకపోలేదు. అలాగే చైనుకి కూడా సున్నితంగా పని చేయాలంటే దానికి తగిన లూబ్రికేషన్ అవసరం. దానికి పట్టిన దుమ్ము, ధూళిని కూడా ఈ లూబ్రికేషన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. కొన్ని మోటారుసైకిళ్లు చైను కాకుండా బెల్టుతో, షాఫ్ట్‌తో నడుస్తాయి. మా తదుపరి గమ్యం స్విట్జర్లాండ్. మా సామానంతా మోటారుసైకిల్ మీద బంజీ తాడులతో గట్టిగా బిగించుకున్నాం. వాటిని మరొకసారి పరిశీలించుకుని అందరం హోటలు నుండి బయలుదేరాము.

స్టెలియో పాస్ వెళ్లాలంటే మళ్లీ గవియా పాస్ మీదుగా వెళ్లాలి. కానీ నిన్నటి సాయంత్రంలాగా ఈరోజు ఆకాశం నిర్మలంగా లేదు. దట్టమైన పొగ మంచుతో చిరు జల్లులు పడుతూ చాలా ఆహ్లాదంగా ఉంది. కాకపోతే మాకు రోడ్ సరిగ్గా కనపడడం లేదు. అందరం పార్కింగ్ లైట్లు వేసుకుని ఒకరి వెనుక ఒకరు నెమ్మదిగ వెళ్తూ ఉన్నాము. గవియా పాస్ చేరుకున్నాము కానీ అక్కడ కూడా పూర్తిగా పొగమంచు. ఎక్కువసేపు ఉండకుండా స్టెల్వియో పాస్ వైపు బయలుదేరాము.

గవియా పాస్ దగ్గర పెద్దగా ట్రాఫిక్ లేదు. స్టెల్వియో పాస్ వెళ్లేటపుడు మాత్రం మోటారు సైకిళ్లు, సైకిళ్లతో చాలా రద్దీగా ఉంది. అడపాదడపా కొన్ని కార్లు కూడా కనపడుతున్నాయి. ఇటువంటి ఎత్తైన ప్రదేశంలో సైకిలు తొక్కుకుంటూ గుంపుగా వెళ్తున్న వారిని చూస్తుంటే చాలా ముచ్చట వేసింది. గవియా పాస్ దారి లాగే ఇది కూడా కొంచెం ఇరుకుగా ఉంది. అపుడపుడూ కారు ఎదురువస్తే నెమ్మదిగా ఆపి మరీ వెళ్తున్నాము. మోటారుసైకిల్ కోసం కారు ఆగడం లేదు. ఇది కొంచెం వింతగా అనిపించింది. అమెరికాలో బైకర్ల కోసం కారు ఆపుతారు. ముందు మోటారుసైకిలుని పంపి తర్వాత వారు వెళ్తారు. మరింత జాగ్రత్తగా ముందు వెళ్తూ ఉన్నాము. ఇటువంటి మలుపుల్లోనే మన మోటరుసైకిలు సత్తా కూడా తెలిసేది! కావలసినంత బరువుతో ఎపుడు, ఎంత వేగంతో వెళ్లల్సి వచ్చినా అవసరాలు తీరుస్తూ ఉన్నా మోటారుసైకిలు నాకు బాగా నచ్చింది. తల పిన్ను మలుపులో మలుపుకి కావలసిన వేగం, అవసరమైన గేరులో లేకుంటే ప్రమాదమే! ఒక్కొక్క మలుపు తిరిగే కొద్దీ మనకి వాటి మీద పట్టు పెరుగుతుంది. మొదట్లో ఉన్న భయం పోయి వాటిని పూర్తిగా అస్వాదించడం మొదలుపెడతాము.

మాకు దారిలో అద్భుతమైన సొరంగాలు కూడా ఎదురయ్యాయి. సొరంగం లోపల లైట్లతో మిరుమిట్లు గొలుపుతూ దారి మరింత అందంగా ఉంది. కొన్ని సొరంగాలు కిలోమీటరు పొడవు పైగా ఉన్నాయి. కొండ ఎక్కేకొద్దీ చుట్టూ అద్భుతమైన పర్వతాలు కనిపిస్తున్నాయి. దారి పక్కనే గలగలా పారుతూ నీళ్లు, కొన్ని జలపాతాలతో మా ప్రయాణం ఆనందంగా, ఆశ్చర్యంగా సాగింది. దారిలో కాఫీలు, టీలు దొరికే





సదుపాయాలు లేవు. దాహమేస్తే రోడ్ పక్కన పారుతున్న నీళ్లు తాగడమే. ప్లాస్టిక్ బాటిళ్లలో వస్తున్న నీళ్ల కంటే ఇవి ఎంతో స్వచ్ఛంగా ఉన్నాయి.

స్టెల్వియో పాస్ చేరుకున్నాక అక్కడ కొన్ని దుకాణాలు, భోజన హోటళ్లు కనిపించాయి. విహారానికి వచ్చిన ప్రయాణీకులతో ఆ ప్రదేశం కళకళలాడుతోంది. మా మధ్యాహ్న భోజనానికి ఒక మంచి హోటలు వెతుక్కుని అందరం వేడిగా కాఫీలు తాగాము. ఇక్కడి రెస్టారెంటులో డచ్, ఇటాలియన్, ఫ్రెంచ్ మాట్లాడుతారు. కొంచెం కూడుకుని ఇంగ్లీషులో బదులివ్వడానికి ప్రయత్నిస్తారు. నేను చెన్నైలో ఐటీ కంపెనీలో పని చేస్తున్నపుడు మా కంపెనీ మా టీమ్‌ని స్విస్ పంపడానికి నిశ్చయించింది. మాకు భాష రాదు కాబట్టి నుంగంబాక్కంలో ఉండే డచ్ కౌన్సలేటులో నేర్చుకోవడానికి పంపారు. ఇంచుమించు ఒక నెలరోజులు అక్కడ సరదాగా డచ్ భాష నేర్చుకున్నాము. ఆ రోజు నేర్చుకున్న భాష ఈ రోజు మాకు ఇలా ఉపయోగపడింది. పూర్తిగా గలగలా మాట్లాడలేకపోయినా 'నీ పేరు ఏమిటి?', 'నాకు నీళ్లు కావాలి', 'నువ్వు ఏమి చేస్తూ ఉంటావు?' లాంటి పరిచయ వాక్యాలు మాత్రం బాగా వచ్చు.

మాతో పాటు అక్కడే కూర్చున తోటి బైకర్లతో కబుర్లు మొదలుపెట్టాము. చాలామంది బైకర్లు ప్రతి వేసవిలో తాము ఇక్కడకి వస్తూ ఉంటామని చెప్పారు. ఎక్కువగా బీయెండబ్ల్యూకి చెందిన బైకులు కనిపించాయి. అక్కడక్కడా కొన్ని హోండా, యమహా మోటారుసైకిళ్లు కనిపించాయి. ఇది ఎండాకాలమైనా ఎత్తైన ప్రదేశం కాబట్టి బాగా చలిగా కూడా ఉంది. చుట్టూ మంచు కప్పబడిన కొండలు, కింద పాములా మెలికలు తిరుగుతూ కనిపిస్తున్న రోడ్, దాని మీద సైకిళ్లు, మోటారుసైకిళ్లు, కార్లు బొమ్మల కొలువులో బొమ్మల్లాగా కనిపిస్తున్నాయి. వేడి వేడి కెపచీనో తాగగానే ప్రాణం లేచి వచ్చింది.

భోజనం ముగించి కొన్ని ఫోటోలు దిగి అందరం

స్టెల్వియో పాస్ దిగడం మొదలుపెట్టాము. ఎక్కే టపుడు నెమ్మదిగా ఎక్కిన సైకిళ్లు ఇపుడు తారా జువ్వలా దూసుకుని వెళ్తున్నాయి. అంత స్పీడులో వాళ్లకి అడ్డం వస్తే వాళ్లు ఆగడం చాలా కష్టం. వారికి దారిని ఇస్తూ మాకు రోడ్ అనుకూలంగా ఉన్నపుడు దూసుకువెళ్లేవాళ్లం. స్టెల్వియో దిగేటపుడు ఒక మలుపు దగ్గర ఒక ఫోటోగ్రాఫర్ కూర్చుని వచ్చి పోయే మోటారుసైకిళ్లందరినీ ఫోటో తీస్తూ కూర్చున్నాడు. ఫోటో స్టెల్వియో సంస్థ పేరుతో వీరు ఫోటోలు తీసి ఆ రోజు ఆల్బంలో ఫోటోలన్నీ ఉంచుతారు. టెక్సస్‌లో ఉన్న హిల్ కంట్రీలో కూడా ట్విస్టెడ్ సిస్టర్స్‌లో ఒకచోట కాపు కాసి మోటారుసైకిళ్ల ఫోటోలన్నీ తీస్తూ ఉంటారు. ఆరోజు తీసిన ఫోటోలు వారి వెబ్ సైటులో ఉంచు తారు.

సాయంత్రానికి మేము ఆ రాత్రి బస చేసే ఊరు ప్రోస్టో చేరుకున్నాము. ఈ ఊరు ఇటలీ, స్విట్జర్లాండ్ సరిహద్దులో ఉంటుంది. హోటల్ చిరునామా కోసం వెతుకుతూ ఒక కూడలి దగ్గర ఆగాము. అక్కడ ఒక అయిదు, పది నిముషాలు అటూ, ఇటూ తిరుగుతూ మేము బుక్ చేసుకున్న హోటల్ కోసం తిరిగాము. తీరా చూస్తే మేము మొదట ఏ కూడలిలో ఆగామో అక్కడే హోటల్ ఉంది. మన జీవితంలో కూడా చాలాసార్లు వేటికోసమో వెతుకుతూ ఉంటాము. అది మన పక్కనే ఉన్నా మనం గ్రహించలేము!

మా హోటల్ రోడ్ మీదే ఉన్నా, వెనక వైపు పెద్ద చెట్లు. వాటి వెనుక దూరంగా కొండలు. మా రూములో కిటికీలు తీస్తే హాయిగా గాలి వీస్తోంది. హోటల్ పై అంతస్తు డాబాపై నిల్చుంటే ఊరంతా అందంగా కనిపిస్తోంది. అందరం స్నానాలు చేసి డాబా పైన కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వైన్ తాగాము. ముందు రోజు గొడవపడినా ఆ రోజంతా నేను, రామ్ సరదాగా మాట్లాడుకున్నాము. స్నేహితుల మధ్య స్పర్ధలు వచ్చినా, అది ఎక్కువ కాలం ఉండవు.

(సశేషం)



కథ

# ఐసీసీయూ

## శ్యామ్ చిర్రావూరి

నా కళ్లు ఇరవైనాలుగ్గంటలూ పనిచేస్తయ్. నా గుండెలు అనుక్షణం కొట్టుకుంటయ్. నా చేతులు అవిరామంగా తిరుగుతయ్.

గోడపైనే కాపురం. నా పేరు గోడ గడియారం.

ఇక్కడి ఈ గోడకి వచ్చి కొద్దిరోజులే అయింది. వెళ్లిపోతూ వెళ్లిపోతూ తన గుండెల్ని పిండే వ్యాధి నుంచి రక్షించారనే ప్రేమతో లేక భ్రమతో నా గతకాలపు యజమాని నన్నూ, సోదరులనీ తీసుకువచ్చి వీళ్లకి, ఈ హాస్పిటల్ వాళ్లకి ఇచ్చాడు. అంతకుముందర అందరం ఒకేచోట 'డింగ్... డాంగ్... డింగ్... డొంగ్...' 'అలారం... అలారం' 'కులాసా... కులాసా' అని గడిపేవాళ్లం రోజులు.

ఇక్కడకి వచ్చిందగ్గర్నుంచీ కుతూహలం, క్యూరియాసిటీ, వుత్సాహం, వుద్రేకం. వుద్వేగంగా క్షణం క్షణం గడుస్తోంది... నడుస్తోంది నాకు.



ఎదురుగా మధ్యలో సెంట్రల్ మోనిటర్. నా ఎదురుగా మూడు బెడ్లు, నా క్రిందని సరిగ్గా నాక్కని పించకుండా వినిపించడం మాత్రమే జరిగేచోట ఒక బెడ్. నా కుడివైపు చిన్న గది వంటిది. కాని గది కాదు. ఈ గదీ ఆ జాగా కలిసే వున్నయ్. అక్కడో బెడ్డు.

ఇది హృదయరోగ నిలయం. ఇక్కడ అన్ని ప్రక్కలా గుండెగోడల మారుమూలల చిరు చిరు దారుణాల నుంచి బరువైన ఘోరాల వరకు గురైన పేషెంట్లే!

మోనీటర్‌కి ఎదురుగా కాస్త వాలడానికి వీలైన కుర్చీలో కుర్రడాక్టరు, అతనికి ఎదురుగా మోనీటర్ వున్న టేబుల్‌కి అవతల ఎర్ర పంజాబీ నర్స్. ఆ అమ్మాయి ఏవేవో రాసేస్తోంది. ఆ అబ్బాయి ఇంకేవేవో రాసేస్తున్నాడు.

ఔను. ఇది పగలు. పగలు కురవడానికి వీలు పడని పగలు.

మూడు పక్కల మీదా ముగ్గురు పేషెంట్లున్నారు. ముగ్గుర్నీ వైర్లతో మోనీటర్లకి కలిపి వుంచారు, ఈ మోనిటర్ల నుంచి సెంట్రల్ మోనీటర్లోకి వెళ్తాయి హృదయ కండరాల సంకోచ వ్యాకోచ వివరాలు.

అలలవంటివి ఆకుపచ్చ రంగులో... దిక్కు తోచని జనప్రవాహంలా గబగబా పరిగెడుతున్నాయి మోనీటర్ మీద.

గుండెలో జరిగే విద్యుత్ క్రియల ఫలితాలని చూపించే రేఖలివి. ఈ రేఖల వివరాల్లో అప్పుడప్పుడు కలిగే స్వల్పమైన మార్పులు జరగబోయే లేక జరుగు తున్న ప్రమాదాలకి సూచికలు.

అన్ని రేఖలూ ఒకేలా అర్థం లేనట్టు కన్పిస్తున్న వాటిలో అనేక రకాలున్నాయి. విన్న పేరు వినకుండా వింటున్నాను. కాని కొన్ని కొన్ని పదాలు సర్వసామా న్యంగా విన్పిస్తుంటాయి. అందులో ఎక్టోపిక్కు ఒకటి.

ఈ ఎక్టోపిక్కు వున్నా పర్వాలేదన్నట్టుగా వుంటు న్నారు వీళ్లు. 'ప్రమాదం ప్రమాదం' అన్నట్టుగా కూడా వుంటున్నారు. అంటే ఇవీ కొన్ని కొన్నిసార్లు ప్రమాద కరమూ, కొన్ని కొన్నిసార్లు ప్రమాదరహితమూ అన్న మాట. ఏమిటో వివాదాస్పదంగా వున్నట్టూ స్పష్టంగా చెప్పాలంటే అస్పష్టంగా వున్నట్టూ అన్పించడంలేదూ!?

మొదటిసారి నేను ఈ ఎక్టోపిక్కు గురించి విన్నప్పుడు, ఆ చెబుతున్న డాక్టరు ముఖం... ఆదుర్దా... చెమట బిందువులూ... గొంతులో వణుకూ విన్నా. నా గుండెలు కూడా దడదడలాడడం ప్రారంభించాయి.

నరమానవుణ్ణి కాని నాకే ఇలా గుండె గొంతుక లోన కొట్లాడితే, మనుషులకీ మగువలకీ నిర్భయం, అభయం ఎలా వుంటాయి?

మొదట విన్నపుడు కలిగిన భయం, తర్వాత ఎన్నిసార్లు అభయం ఇచ్చినా కనీసం సందేహంలానైనా మిగిలి వుంటుంది.

ఇలాంటి నా లెక్చర్లని కాసేపు ఆపి అదిగో వాళ్లని విందాం.

పంజాబీ నర్సుపిల్ల కుర్రడాక్టరు భుజంమీద కొట్టింది. మనవాడు చేతులు ముడుచుకున్నట్టు మొఖంపెట్టి, "మంచిదికాదు నీకే," అన్నాడు.

"అంటే?" అంది.

"ఆలోచించుకో" అన్నాడు.

"నేనెవర్నీ లక్ష్యపెట్టను," అంది. ఆ అమ్మాయి నిర్లక్ష్యం ఆ అమ్మాయి నిలబడ్డ తీరులోనే కన్పిస్తుంది. ఆ అమ్మాయి కళ్లలో కన్పిస్తుంది.

ఈ నిర్భీతికి కారణం అనుభవం లేకపోవడం అన్న విషయం ఇంకా ఆ అమ్మాయికి తెలీదు.

కాని భయంలేని మనిషిలేడు అని నాకీ మధ్య తెలుస్తోంది. మళ్లీ నేను మాట్లాడుతున్నాను మధ్యలో.

వీళ్ల సంభాషణా, ప్రవర్తనా ఎటు దారితీసునో కాని అకస్మాత్తుగా తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు కన్సల్టెంట్- అంటే సీనియర్ డాక్టరు.

అబ్బాయి నిలబడ్డాడు. అమ్మాయి సర్దుకుంది.

ఈ కన్సల్టెంట్‌ను చూస్తే గాలిదుమారం గుర్తొ స్తుంది. వీళ్లు నేలమీద నిలబడరు. గోడకి ఆనుకోరు. పగలూ, రాత్రీ ఒకటే పరుగు. కనీసం పేషెంట్సుని

సరిగా చూసేపాటి సమయం కూడా వున్నట్టు కన్పించదు. శ్రమించడమే కాని విశ్రమించడం ఎరగని వాళ్లు. వీళ్లకి ఇరవై నాలుగ్గంటలూ పేషెంట్సు ప్రాక్టీసూ అర్థమెటిక్ లెక్కలు.

"ఎలా వున్నారు పేషెంట్సు?" అన్నాడు. కుర్రాడు చిలకపలుకులు పలికాడు. అమ్మాయి తను చెప్పవలసింది చెప్పింది. 'గుడ్ లక్' అని వెళ్లిపోయాడు కన్సల్టెంటు. ఎవరికి? దేనికి? గుడ్‌లక్! అర్థంకాదు.

మొదటి పేషెంటు పేరు మన్మోహన్ క్రిష్ణ, వయసు 32 సంవత్సరాలు. గుండెలో తీవ్రమైన నొప్పి ఒక రాత్రి బయలుదేరింది. స్మోకింగ్ చెయ్యడట. అపుడూ అపుడూ పదిహేను రోజులకొకసారి మాత్రం తాగుతాడట. బిజీ వుద్యోగం. అందమైన భార్య, సరిపోయినంత ఆస్తి ఇతని సొత్తులు.

ఆ కుర్రవాడు అనగా మన్మోహన్ రోజంతా తన భార్యని మరీ మరీ లోపలికి రమ్మని పిలుస్తాడు. పాపం భార్య ఏం చేస్తుంది? రావడానికి కుర్ర డాక్టరు పర్మిషన్ అవసరం. మరి ఇతగాడు ఆవిడ్ని మాటిమాటికీ లోపలికి పోవడానికి వీల్లేదు, సాయంత్రం మాత్రమే అంటాడు. ఘోషిస్తాడు, గర్జిస్తాడు ఆఖరికి శోషిల్లాడు కూడా.

గుండెనొప్పి తీవ్రమైనది ఆ రోజున. గుండెలోపలి విద్యుత్తరంగాలు రికార్డు చేశారు. ఈసీజీ తీశారు. 'ఎక్స్టెన్సివ్ ఏస్టీరియల్ ఇన్ఫార్షన్' అన్నారు. గుండె ముందువైపు వుండే గోడగోడంతా పోయిందన్నారు. ఇతనికి చెప్పం కనక నువ్వు ఏడ్వడానికి కూడా వీల్లేదన్నారు అతగాడి భార్యతో,

ఏడ్వలేక, నవ్వలేక ఏంచెయ్యాలో తెలీక అతగాడి భార్య రోజుకో చీరె కట్టుకు వస్తోంది. కుర్రడాక్టరు అపుడూ అపుడూ గుటకలు వేస్తున్నారు. మళ్లీ సర్దుకుంటున్నాడు.

"డాక్టర్ నా భార్యనీ నన్నూ కూడా వుండనివ్వండి," అంటాడు మన్మోహన్ క్రిష్ణ. వుండి వుండి గుండె పట్టుకుంటాడు. నిజంగా నొప్పి వుందో, లేదో తెలీకుండాపోయింది తనకి.

రెండవ పేషెంటు పేరు ఏదో తెలీదు. అంటే


COOLPHABETS.COM



We help kids learn their native alphabet through beautifully designed everyday objects

T-Shirts . Mugs . Totes . iPhone Cases . iPad Cases . Pillows . Posters

గుర్తురావడం లేదు. కశ్మీరీగేటు దగ్గర బట్టలషాపుట. ఇతను కూడా యువకుడే. వయసు 45 ఏళ్లదాకా వుంటుంది. ఈసీజీ తీసి ఎక్స్టెన్సివ్ ఏన్టీరియర్ ఇన్ఫార్షన్ అన్నారు.

ఈయన సిగరెట్ కాల్చడు. తాగడు. షుగర్ జబ్బుగానీ, బ్లడ్ ప్రెషరుగానీ లేవు. వంశపారంపర్యంగా వచ్చిన సూచనలు కూడా లేవు.

ఏమిటో మానవుడు తెలిసినన్ని తలుపులు తెరిచి రహస్యాలు తెలుసుకున్నా మొత్తం తలుపులు ఎన్నో తెలీనపుడు ఎన్ని తలుపులు తెరవగలడు?

మూడో పేషెంటు ముసలివాడు. బాగా ఊపిరి తిరగడంలేదని వచ్చాడు. గుండెలో నొప్పి వుందని నామమాత్రంగానైనా చెప్పలేదు. మామూలుగా ఈసీజీ తీస్తే 'ఇన్ఫీరియల్ ఇన్ఫార్షన్' వుందని తెలిపింది.

మామూలుగా ఇచ్చే ఇంజక్షన్లకీ, ఆక్సిజన్‌కీ మూసివేయబడిన ఆ వాతావరణానికీ నీలంగా రంగులు వున్న గోడలను చూసి ఆ ముసిలాయన మురిసిపోయేడు. 'పిలవగానే పలికే డాక్టరూ, సిస్టరూ' అని సంతోషించేడు.

చుట్టాలనీ, చూపరులనీ లోపలికి రానివ్వరని నిక్కచ్చిగా కుర్రడాక్టరు చెప్పినప్పుడు మంచి మంచి పద్ధతులు బేషుగ్గా వున్నాయని మెచ్చుకున్నాడు.

నాలుగో బెడ్ మీద ఒక ఏంజినా పేషెంటు వున్నాడు. ఈయనకీ అలసినా, అరిచినా గుండెల్లో నొప్పి వస్తుంది. ఈయన ఎడాపెడా సిగరెట్లు తాగుతాడు. రాత్రంతా మేలుకోవడం ఈయనకి నిత్య కృత్యం. తాగడంలో రూలూ, రెగ్యులారిటీ లేదు. ఈయన చిన్నసైజు బ్లడ్ ప్రెషర్ పేషెంటు. ఉప్పు వదిలి వుండలేడు.

అందువలన ఈయనకి చీటికీ మాటికీ గుండె నొప్పి వస్తుంది.

ఈసారి ఈసీజీలో మార్పులు కాస్త అనుమానాస్పదంగా వున్నాయని అబ్జర్వేషన్ కోసం చేర్చారు.

అయిదో నంబర్ బెడ్‌లో ప్రస్తుతం ఎవరూ లేరు. ముందో అమ్మాయి వుండేది. ఆ అమ్మాయి గుండె 'ఆహిస్తా, ఆహిస్తా' అని మహ్మద్ రఫీ పాటలా కొంత సేపు మెల్లగానూ, 'చాహే కోయి ముయె జంగ్లీ కహే' అని ధడక్ దడక్‌మని కొట్టుకోవడమూ చేసేది. 'సిక్ సైనస్ సిండ్రోమ్' అని పేరు పెట్టి ఆ అమ్మాయిని కూడా వుంచారు అబ్జర్వేషన్‌కి. నిన్ననే పంపించేశారు-కారణమేమీ కనిపించక 'వైరల్ మయోకార్డయిటిస్' అని పేరు పెట్టి.

ఐసీసీయూలో (ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్) అడ్మిట్ అయిన ప్రతీ పేషెంటు గురించి అయిదు ముఖ్య విషయాలు గుర్తించి కాగితం మీద రాయాలంటుంది చిన్న లేడీ కన్సల్టెంట్. అందులో తాగుతాడా తాగడా అన్నది ఒకటి.

అమెరికా పుస్తకాలు తప్ప మన పుస్తకాలు అసలు ముట్టని కుర్రడాక్టరు ఈ లేడీ డాక్టరుకేం రాదంటాడు. "అంటే నాకంటే రెండు ముక్కలు రావొచ్చు. నాకంటే ఆరేళ్ల అనుభవానికి రావాల్సినంత రాదు. ఉదాహరణకి ఈ తాగడమే తీసుకో, ఆల్కహాలకీ మయోకార్డియల్ ఇన్ఫార్షన్‌కీ ఏమీ సంబంధం లేదు అని ఇక్కడ స్పష్టంగా రాసేడు," అన్నాడు పంజాబీ ఎర్రనర్సు పిల్ల భుజంమీద ఓ చరుపు చరిచి.

టేబుల్ మీద వున్న 'కార్డియో వాస్కులార్ డయగ్నోసిస్ ఎండ్ థెరపీ' అనే పుస్తకం తీశాడు.

"చూడు చిన్నగా వున్నా ఎంత ముద్దుగా వుందో," అన్నాడు. 'నీలా!' అని యాడ్ చేశాడు.

"ఏవన్నావ్?" అంది.

"నీలా ముద్దుగా వుంది అన్నాను," అన్నాడు.

"కాని ఒక్కటే తేడా. ఈ పుస్తకాన్ని నా ఇష్టం వచ్చినపుడు ముద్దుపెట్టుకోవచ్చు. కాని నిన్ను కుదరదు కదా," అన్నాడు.

ఆ అమ్మాయి పకపకా నవ్వింది.

ఆమె బుగ్గల్లో ఎర్రదనం, సిగ్గూ, ఆమె కళ్లల్లో అతనంటే బహుశా అతని మాటలంటే ఇష్టమూ స్పష్టంగా మెరిశాయి.

"ఏం?" అంది ఆ అమ్మాయి.

"మనసా కవ్వించకే నన్నిలా..." అని తెలుగుపాట పాడాడు.

"ఏంటి అంటున్నావ్." అంది.

"ఏమీలేదు. ఈ పేషెంట్లు లేకుండా నువ్వూ నేనూ మాత్రమే వుంటే అని ఆలోచిస్తున్నాను," అన్నాడు.

"డాక్టర్," అని పిలిచాడు బెడ్ నంబర్ వన్ మన్మోహన్ క్రిష్ణ

"ఎస్," అని నడిచాడు కుర్రడాక్టరు.

"ఆర్ యు బిజీ?" అని అడిగాడు మన్మోహన్,

ఏమనాలో తెలియకపోయినా, అప్రయత్నంగా అలవాటుగా "నో" అని వచ్చింది. నోటి నుంచి.

"కూర్చోండి డాక్టర్," అని తన పక్కమీద చూపించాడు.

"పరవాలేదు చెప్పండి. నిలబడ్డం మాకు అలవాటే," అని అంటూ ఎర్రపిల్లవైపు చూశాడు. ఆ చూపులో, 'ఇవాల్టికి వీడి స్టోరీ పూర్తికాదు. మన స్టోరీ మొదలుకాదు,' అన్న భావం వుంది.

ఆ అమ్మాయి నిట్టూర్చినట్టు నడిచింది ప్రక్క గదిలోకి. మన్మోహన్ మొదలుపెట్టాడు, "తను కాలేజీలో చదివే రోజుల్లో..."

కుర్రడాక్టరు కసిగా అడ్డు తగిలాడు, "ఏం చదివారంటూ..."

"బీ.కాం." అన్నాడు.

ఆ రోజుల్లో తను చాలా ఫ్లర్టింగ్ టైప్ మనిషినని స్పష్టంగా చెప్పాడు. కుర్రడాక్టరు వినడం ప్రారంభించాడు,

"నేను చాలామంది అమ్మాయిలతో తిరిగాను. ఒక విధంగా చెప్పాలంటే ఆడదాని పవిత్రత మీద నాకు నమ్మకంలేదు. అవకాశం లేనివాళ్లు మాత్రమే పవిత్రంగా వుంటారని నా వుద్దేశ్యం. కాని నా భార్య పవిత్రంగా వుండాలని కూడా నా కోరిక. నేను స్కూటర్ మీద నా భార్యతో వెళ్లేటపుడు ఎవరైనా నా భార్యవైపు కళ్లార్పకుండా చూస్తే నా రక్తం కుతకుత వుడికిపోయేది. వింటున్నారా డాక్టర్? ఇదీ నా మనస్తత్వం..." అని ఏదో చెప్పబోయాడు.

ఇంతలో లోపలికి మిసెస్ మన్మోహన్ ప్రవేశించింది.

పూర్తిగా ఆకుపచ్చరంగు దుస్తుల్లో గులాబీరంగు శరీరంతో మిలమిలా మెరిసిపోతోంది.

ఆమె మీద నుంచి కదలని చూపులూ, చెవిలో మన్మోహన్ చెప్పిన మాటలు ఈ రెంటి మధ్య సమతా స్థితికి చేరడానికి కాస్త టైము తీసుకున్నాడు కుర్రడాక్టరు.

వెళ్లి తన కుర్చీలో కూర్చున్నాడు.

టేబిల్ పై ఎదురుగా ఎర్రగా వున్న పుస్తకం తీసుకున్నాడు. అందులో గుండెపోటుకు గురైన పేషెంట్లకు ఇవ్వవలసిన సలహాల గురించిన ఛాప్టరు తీసి చదవడం ప్రారంభించాడు.

తెలిసిన విషయాలను గురించి చదువుతున్నప్పుడు కూడా కొత్తకొత్త కోణాలు ఇంతకుముందు మనం గమనించనివి ఎలా వుంటాయో ఆశ్చర్యపోతూ చదువుతున్నాడు.

చిన్న వయసులో ఇన్ఫార్షన్‌కు గురైనవారికి ఇవ్వవలసిన సలహాల్లో శృంగార జీవితానికీ, సెక్సుకీ సంబంధించినవి కొన్ని.

'సెక్సు కంప్లీటుగా కట్,' అనరాదట. అలా అంటే వ్యాకులత వ్యాపించి వ్యాపించి వాని మెదడుని పూర్తిగా కలచివేస్తుందిట.

మరి బలహీనమైన గుండెతో ఉద్రేకపూరితమైన ప్రక్రియలు జరపడం ఎంతవరకూ సబబు? దీనికి సంబంధించిన డిస్కషన్‌ని చదువుతూ కుర్చీలో వెనక్కివాలి ఆలోచిస్తున్నాడు కుర్రడాక్టరు.


## యువ రచయితల రచనలకు ఆహ్వానం

***హైస్కూలు, కాలేజి విద్యార్థులైన తెలుగు యువత నుంచి కథలు, కవితలు, వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. తెలుగులో కానీ, ఇంగ్లీషులో కానీ రాయవచ్చు. వివరాలకు:*** *editor@tana.org*




మళ్లీ "డాక్టర్!" అని పిలిచాడు మన్మోహన్.

ఈసారి కాస్త క్యూరియాసిటీతో నడచి అతని దగ్గరికి వెళ్లాడు కుర్రడాక్టరు.

ఒక విధంగా చెప్పాలంటే మన్మోహన్ తన సమస్యని చాలా స్పష్టంగా వివరించాడు. తన సందేహాల్ని సూటిగా సూచించాడు.

తనకి స్త్రీలమీద నమ్మకం లేదన్న విషయం ఇందాకే స్పష్టం చేశాడు కనుక - ఇలా అన్నాడు:

"నా భార్యే కనుక నా బలహీనమైన పరిస్థితి వలన తన బలహీనతలకు లోనయి అటువంటి, ఇటువంటి పరిస్థితిలో పడడం నేను ఎంతమాత్రమూ సహించలేను. ఈ విషయమే నన్ను ప్రతీ క్షణం తినేస్తోంది. అందుకనే నా భార్య నా ప్రక్కనే వుండాలని కోరుతున్నాను."

కుర్రడాక్టరు తనకు ఆడవాళ్లమీద వుండే అభిప్రాయాల్ని గురించి ఆలోచించడం లేదు.

ఆటోమేటిగ్గా నటించడం ప్రారంభించాడు.

భారతీయ స్త్రీలూ, వాళ్ల పవిత్రతా, ఇండియన్ ట్రెడిషన్- దాని ప్రభావం. తన వుద్దేశ్యంలో అతని మిసెస్ పట్ల (ఆవిడ స్లీవ్‌లెస్లూ. లోనెక వైపు తన చూపులూ మైనస్ చేసి) తన మనసులో మెదిలే గౌరవభావం చెప్పాడు.

ఒక నిమిషం ఆగి మళ్లీ ఇలా అన్నాడు: "ఎన్ని అడుగులు ముందుకు వేసినా భారతీయ మహిళ భారతీయ మహిళే."

ఇలా అనడంతో అతని మనసులో భారతీయ మహిళల ఇన్హిబిషన్స్, భయాలపట్ల ఆప్యాయత నిజంగానే పెల్లుబికింది.

ఆపైన సైంటిఫిక్ విషయాల్ని సులభమైన భాషలో వివరించాడు. సెక్స్ విషయంలో అతను (మన్మోహన్) ఎంతమాత్రమూ బలహీనుడు కాడు అన్న విషయంలో వీలయినంత నమ్మకాన్ని కలిగించాడు. కావాలంటే ఎర్ర పుస్తకం చదవమన్నాడు. ఏదో ఒక వాక్యం చదివి వినిపించాడు.

*

రెండు మూడు రోజుల తర్వాత మన్మోహన్ క్రిష్ణని వార్డుకి షిఫ్ట్ చేశారు. అపుడూ అపుడూ శ్రీమతి మన్మోహన్ లిఫ్ట్ దగ్గర కనబడిందనీ, అదనీ, ఇదనీ కుర్ర

డాక్టరు అంటూ వుండేవాడు. ఆ తరువాత వాళ్ల గురించి మాట్లాడలేదు. అంటే వాళ్లు ఇంటికిపోయి వుండాలి.

*

రెండవ నంబర్ పేషెంటు, ఎక్స్టెన్సివ్ ఏంటీరియర్ ఇన్ఫార్షన్. ఏ విధమైన కారణం కనబడబడని పరిస్థితి

ఈయన వలన ఎక్టోపిక్స్ ఎంత భయంకరమైనవో తెలుసుకున్నాను.

ఎక్టోపిక్స్ గబగబ లెక్కలేనన్ని వచ్చాయి. రకరకాలవి వచ్చాయి ఇతనికి.

రెండు రోజులు డ్రిప్ పెట్టారు.

మందులు ప్రారంభించారు.

ఏంచేసినా ఎక్టోపిక్సు అందరి బుర్రల్నీ తినేశాయి.

ఈయనకోసం ఈయన బంధువులు నగరంలో వున్న ప్రముఖ, అప్రముఖ, తెలివైన, తెలివితక్కువ, అందరు డాక్టర్లనీ పిలిచారు, 'రండి రండి చూడండని.'

వాళ్లకేం వచ్చినవాళ్లు వచ్చినట్టు 'టింగు రంగా' అని తమ తమ ఫీజులు తీసుకుపోయారు.

ఒకరు ఈ మందు ప్రారంభించండి అని రాసిపోతే ఒకళ్లు ఈ మందు మానివేయండి అని రాసిపోయారు.

చివరకు పేషెంటుకు దక్కిన మందులు పంజాబీ నర్సుపిల్ల, కుర్రడాక్టరు ఛాయిస్ మీద దక్కినవి.

ఒక ఎక్స్‌పర్ట్ డాక్టరు, "ఇది ఐడియల్ కేస్ ఫర్ ఫేసింగ్," అన్నాడు.

"పేసింగ్ శుద్ధ వేస్టు," అన్నాడు మరొకాయన.

ఒక వుదయం ఎక్టోపిక్సు ఉధృతంగా వ్యాపించి. అకస్మాత్తుగా ఘోరమైన స్థితిలో పడ్డాడు. దీన్నే వి.ఎఫ్. (VF) అంటారుట.

"వి.ఎఫ్. వి.ఎఫ్" అని అర్చి, డీఫిబ్రిలేటరుతో పేషెంటుకి షాకు కొట్టాడు కుర్రడాక్టరు.

ఆగిపోయిన గుండె పనిచేస్తుందన్న విషయం మొదటిసారిగా గమనించాను. క్రమక్రమంగా కోలుకో సాగాడు పేషెంటు. రోజులు గడుస్తున్నయ్.

*

'ఇలస్ట్రేటెడ్ వీక్లీ' వాళ్లు గుండెజబ్బులు- రక్తనాళాలకి సంబంధించిన శస్త్రచికిత్స మీద ఒక ప్రత్యేక సంచిక వేశారుట. అది విడుదలైన వారం పదిరోజుల్లో ఢిల్లీ, బొంబాయి మొదలైన పెద్ద నగరాల్లో గుండెనొప్పులతో డాక్టర్లని దర్శించే పేషెంట్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందట.

ఈ విషయాన్నే గేటు దగ్గర నిలబడి ఇద్దరు కన్సల్టెంట్లు మాట్లాడుకుంటున్నారు.

ఆ విషయం మాట్లాడుకుని కన్సల్టెంట్లు బయటికి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

కుర్రడాక్టరూ, ఎర్రనర్సూ టేబిల్ దగ్గర కూర్చుని చుక్కలూ, గీతలూ, గళ్లూ ఆట ఆడుకుంటున్నారు ఆ వేళ పని అయిపోవడం వలన.

"నేను గెలిస్తే నువ్వు నాకు టాఫీకంటే పెద్ద టాఫీ ఇవ్వాలి. నేను ఓడిపోతే నీకు నేను ఇస్తాను," అన్నాడు కుర్రడాక్టరు.

"టాఫీ కంటే పెద్ద టాఫీ అంటే...?"

"తెలీదా?!" అన్నాడు గమ్మత్తుగా నవ్వుతూ.

"ఊహూఁ..."

"స్వీట్. స్వీట్. కే... ఒకే..." అన్నాడు.

ఆ అమ్మాయికి అర్థమయీ, అర్థంకాని సందేహం. ఎందుకయినా మంచిదని "నో" అంది.

"నో అంటే నే ఆడను పో," అన్నాడు కుర్రడాక్టరు.

"ఆరెంజి డ్రింకు ఆరెంజి డ్రింకు పందెం," అంది ఆ అమ్మాయి.

"టాఫీ టాఫీ పందెం," అన్నాడు కుర్రడాక్టరు.

"సరే టాఫీ టాఫీ పందెం," అంది అమ్మాయి నవ్వుతూ.

ఇద్దరూ ఆటలో పడ్డారు. ఆరోజు ఆ మూడు ముఖ్య విషయాలూ జరిగాయి. ఒకటి- మూడో పేషెంటు ముసలాయన డిశ్చార్జి అయాడు వుదయం.

రెండు- మధ్యాహ్నం ఐ.సీ.సీ.యూ.లో ఎవరూ

లేని సమయం చూసి రెండవ నంబర్ బెడ్ పేషెంట్ తన భార్యని ముద్దు పెట్టుకున్నాడు. ఎవరూ లేరనుకున్నాడేమో.

కానీ కుర్రడాక్టరు చూశాడు. కాస్త కసిరేడు అతని భార్యని.

ఆవేశమూ, వుద్రేకమూ వున్నాయో, ఆప్యాయతా అనురాగమూ వున్నాయో అతనిలో ఆ క్షణంలో నాకైతే తెలీదు.

మరో పావుగంటకి మళ్లీ వీ.ఎఫ్. వీ.ఎఫ్. అని అర్చారు. మళ్లీ మామూలు తతంగమంతా చేశారు... కానీ ఈసారి మాట దక్కలేదు. ఫలితం కన్పించలేదు.

రెండవ నంబర్ పేషెంటు మరికలేడు. నిజంగా అతనిలో కలిగిన ఎగసిన వుద్రేకమే ఇందుకు కారణమా?!

ఈ విధంగా ఐసీసీయూ ఖాళీగా వుండడం వలన కుర్రడాక్టరూ, ఎర్రనర్సుల మధ్య చుక్కలూ, గీతలూ, గళ్లూ ఆట బ్రహ్మాండంగా సాగుతోంది.

అకస్మాత్తుగా మూడో ముఖ్య విషయం జరిగింది.

సాయంత్రం ఏడున్నరకి కుర్రడాక్టరు డ్యూటీ పూర్తయే వేళకి మన్మోహన్‌క్రిష్ణ మళ్లీ విపరీతమైన గుండె నొప్పితో వచ్చాడు. అడ్మిట్ చెయ్యవలసి వచ్చింది.

"ఈసీజీలో జరిగిన మార్పులు మామూలు స్థితికి రాకుండానే మళ్లీ రావడం వలన ఇది నిజమైన హార్ట్ ఎటాకా? అన్నది చెప్పలేం,'' అంది చిన్న లేడీ కన్సల్టెంటు.

"ఇతనికి ప్రస్తుతం ఏమీలేదు,'' అని, "డిస్టిల్డ్ వాటర్ ఇంజక్షన్ ఎస్.ఓ.ఎస్. ఇవ్వండి,'' అంది.

"అతని గుండెల మీద స్పష్టంగా వినిపిస్తున్న 'పెరికార్డియర్ రబ్' అతని పెరిగిన గుండెవ్యాధికి నిదర్శనం,'' అన్నాడు కన్సల్టెంట్.

చుక్కలూ, గీతలూ, గళ్లూ, ఆరెంజ్ డ్రింక్, టాఫీల మైకంలో వున్న కుర్రడాక్టరు కళ్లు గిర్రున తిరిగాయి.

తను ఎర్ర పుస్తకంలో చదివి వినిపించిన వాక్యాలు ఎంతవరకు బాధ్యత వహించాయో అర్థంకాలేదు.

రెండవ నంబరు పేషెంటు విషయంలో జరిగిన సంఘటననీ, ఎర్రపుస్తకాన్నీ, మన్మోహన్నీ పక్కపక్కన నిలబెడితే- తన మొహం వెలవెలబోతోంది.

నిజంగా మన్మోహన్‌కి ప్రస్తుతం గుండెజబ్బు ఏమీ లేకుండా వుండడం అన్నది నిజమైతే-

ఈ ఆందోళనంతా మూసివేయబడినట్టున్న ఈ వాతావరణంలో బంధించడం వలన కలిగినదేనా?

ఇంత సోఫిస్టికేటెడ్‌గా పకడ్బందీగా నిర్మించబడిన ఈ ఐసీసీయూల వుపయోగం ఇంతేనా?

మూడవ పేషెంటు ఆనందంగా, హాయిగా, ధైర్యంగా ఇదే గోడల నీలీ నీలి రంగులు చూసి మురిసిపోయి, కోలుకుని ఇంటికి వెళ్లడం వీటివలన కాదా?! వీటి ప్రయోజనం తనకీ వుదయం అత్యున్నతంగా అన్పించలేదా?!!

చదివినవీ, నమ్మినవీ, శాస్త్రజ్ఞులు శాస్త్రీకరించినవీ తను రోగులకి వినిపించి, తను నమ్మి ఘోరంగా దెబ్బ తిన్నాడు,

తన కర్తవ్యం ఏమిటి? ప్రజలకి తను ఇవ్వవలసిన సందేశం ఏమిటి?

తనకే తన దేహమంతా సందేహంతో నిండిపోతే ఇంకే సందేశమేమివ్వగలడు? తనకి తనే అత్యంత చిన్నదైన నీటిబిందువుకంటే చిన్నగా కన్పించి, ఎర్ర నర్సుపిల్లని ఆరెంజీ డ్రింకుగాని, టాఫీగాని ఇవ్వమని అడగడం మర్చిపోయాడు కుర్రడాక్టరు. ❀

***వృత్తిరీత్యా డాక్టరైన మెడికో శ్యామ్ అసలు పేరు శ్యామ్ చిర్రావూరి. 'శ్యామ్ యానా' కథాసంపుటి ప్రచురించారు. ప్రస్తుత నివాసం డల్లాస్.***

## కొసరి పాటలు

# కొసరాజు



**కొసరాజు పేరు వినగానే రైతు జీవిత దర్పణాల వంటి గేయాలు, తాత్విక గీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపద గీతాలు, ప్రబోధ గీతాలు సినీ సంగీత ప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.**

**కొసరాజు రాఘవయ్య గారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు ' సినిమాతోగానీ జరగలేదు. 'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజూ పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారి తీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.**

**మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్థంలో ప్రధానంగా 1970 ప్రాంతాల వరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వభౌమ' బిరుదానికి అర్హుణ్ణీ చేసాయి.  ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.**

## మంచి మనిషి
## కలసి ఉంటే కలదు సుఖం
## హరిశ్చంద్ర










ఛాయా చిత్ర వారి మంచిమనిషి చిత్రానికి కొసరాజు వ్రాసిన మూడు పాటలలో ఒకటి, నాయకుడు నాయికను ఆటపట్టించే టీజింగ్ సాంగ్ ఏమండీ ఇటు చూడండి... అన్న పాట.

పోయినసారి చూసిన ఇల్లరికం సినిమాలోని నిలువవే వాలుకనులదానా... ఈ కోవలోని పాటే అయినా మంచిమనిషిలోని పాట దానికి భిన్నంగా ఉంటుంది.

ఇల్లరికం పాట భర్తను అవమానించి వెళ్లగొట్టిన భార్యకు బుద్ధి చెప్పే కార్యక్రమంలో వస్తుంది కాబట్టి కొంత వెక్కిరింతగా ఉంటుంది.

మంచిమనిషి సినిమాలో నాయిక ఉన్నత కుటుంబానికి చెందిన, చదువు సంస్కారం గల యువతి.

ఏమండీ - ఏమండోయ్...

ఏమండీ - ఇటు చూడండీ...
ఒక్కసారి ఇటు చూశారంటే
మీ సొమ్మేదీ పోదండీ...

సిగలోన దాగిన మల్లెమొగ్గకు
బిగువెందుకో చెప్పాలండీ
వరసైన వన్నెల రామచిల్కకు
పొగరు కాస్త తగ్గాలండీ
మన స్నేహము - మోమాటము
పొడిమాటలతోనే పోదండీ...

॥ఏమండీ॥

మనసంత మాపై వుంది లెండి
తెలుసులెండి మీ తాపం
మొగమంత కన్నులు చేయకండి
దాచుకోండి మీ కోపం
వగలెందుకు సెగలెందుకు
యీసారికి ఏదో పోనీండి ॥ఏమండీ॥

మిము నమ్ముకున్న నేస్తగాడు
మీ వెంటనే ఉన్నాడండి
ఏనాటికీ, ముమ్మాటికీ
తన మనసే మీదన్నాడండి
కవ్వించక - కథ పెంచక
ఔనంటే అంతే చాలండీ ॥ఏమండీ॥



హీరో పరిస్థితులవల్ల దొంగగా మారిన మంచి మనిషి. ఇందుకు తగ్గట్టు ఈ పాటలో భాష మొహమాటంగా మర్యాదగా ఉండటం గమనించవచ్చు. అమ్మాయిని ఏడిపించినట్టుగాక సున్నితంగా ఆటపట్టించినట్టుగా అందంగా ఉంటుందీ పాట.

ఒకసారి ఇటుచూస్తే మీ సొమ్మేది పోదు, ఈసారికి ఏదో పోనీ, ఔనంటే అంతే చాలు వంటి నిసర్గ సుందరమైన వాడుకభాష, వగలెందుకు-సెగలెందుకు కవ్వించక-కథపెంచక వంటి ప్రయోగాలు, అంత్యప్రాసలు ఈ పాటకు వన్నెతెచ్చాయి. అరుదుగా



దోపిడి దోపిడి దోపిడి
మనిషీ మనిషీ దోపిడి
అంతా దొంగల దోపిడి

చిన్న చేపలను పెద్ద చేపలూ
చెప్పకుండ భోంచేయురా
చిన్నవాణ్ణి పైనున్నవాడు
చేజిక్కితే స్వాహా చేయురా
